## క్లుప్తంగా

### ఉపాధి కూలీల ట్రాక్టర్ బోల్తా



పర్వతగిరి:మండలంలోని భట్టుతండా గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తున్న ట్రాక్టర్ బుధవారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మందికి స్వల్ప గాయాలు కాగా ఒకరికి మెడకు, వీపుభాగంలో గాయం కావడంతో వీరిని ఏనుగల్ ప్రాథమిక కేంద్రంలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఎనిమిది మంది డిశ్చార్జి కాగా ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రాణనష్టం జరుగకపోవడంతో కూలీలు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆస్పత్రికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని కూలీలను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

### పర్వతగిరిలో కంటి వైద్యశిబిరం



పర్వతగిరి: ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం వరంగల్ వారి ఆధ్వర్యంలో బుధవారం శరత్ మాక్స్ విజన్ సహకారంతో మండలంలోని పర్వతగిరి, పెద్దతండాలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సుమారు 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, తీవ్రమైన కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారిని మెరుగైన వైద్యం కోసం ఆపరేషన్లు చేయించాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్లు కూడా శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో శిబిరం కో ఆర్డినేటర్స్ గుంశావలి, సాగర్, శ్రీజ ఆప్తోమాజీ, అనూష, హెల్త్ కమ్యూనిటీ వర్కర్ ఊర్మిళ, ప్రజ్వల్ కార్యకర్తలు సుజాత, వెంకన్న, సైకిలాబ్‌బాబు, యాకయ్య, భద్రునాయక్, శ్రీనివాస్, వేణు, వెంకటలక్ష్మి, మౌనిక, కోమల, మమత, ఐషా, తదితరులు పాల్గొన్నారు.

### 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలి



నల్లబెల్లి: ఇంటి నిర్మాణాలకు అడ్డుగా ఉన్న 11 కేవీ తీగలను తొలగించాలని ఏబీఎస్ఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, టీడీవీవీ జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముచ్చింపుల గ్రామంలో బొట్ల మొగిలి, కొయ్యడ కుమారస్వామి, ముచ్చింపుల తండాలో ఆంగోత్ సురేందర్ ఇళ్లు నిర్మించుకోకుండా 11 కేవీ కరెంట్ తీగలు అడ్డుగా ఉన్నాయన్నారు. ఈ తీగలను తొలగిస్తూ ఇంటి నిర్మాణాలకు సహకరించాలని కోరారు. ఈ మేరకు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఏఈ పెద్ది రవళికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రఘు నాయక్, సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### 18న చిత్రకళా పోటీలు

హన్మకొండ చౌరస్తా : ఈ నెల 18న వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో చిత్రకళా పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ నేతృత్వంలో కొనసాగే పోటీలు 'ప్రపంచ శాంతి–జాతీయ సమైక్యత' అంశంపై నాలుగు విభాగాల్లో ఉంటాయని తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కొనసాగే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఉదయం 7.30 గంటలకే పబ్లిక్‌గార్డెన్‌కు చేరుకోవాలని సూచించారు. పేర్ల రిజిస్ట్రేషన్ కోసం 81436 43337 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

### రేపటి నుంచి సమ్మర్ క్యాంప్‌లు

న్యూశాయంపేట : వరంగల్ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (జీఐఓ) ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 22 వరకు సమ్మర్ ఇస్లామిక్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు జీఐఓ బాధ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో ముఖ్యంగా 13 నుంచి 30 సంవత్సరాల మధ్య గల బాలికలకు ఖురాన్ డిజైర్డ్ పర్సనాలిటీ, ఇన్‌స్పైరింగ్ స్టోరీలు, స్కిల్ డెవలప్‌మెంట్, మోటివేషన్ క్లాసులు తదితర వాటిపై తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలోని ఎల్‌బీ నగర్, మండిబజార్, మసూమ్ అలీ స్ట్రీట్ ప్రాంతాల్లో క్యాంప్‌లు ఉంటాయన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందచేస్తామన్నారు. పూర్తి వివరాలకు 93989 10253, 81060 94070 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# దోస్త్ రిజిస్ట్రేషన్లు షురూ..

● డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం

నర్సంపేట: తెలంగాణలోని డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ) ప్రకటన జారీ చేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15ప్రభుత్వ, 126ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం మే 6వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగనుంది. జూలై 8వ తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌కు అనుసంధానమై ఉండాలి. విద్యార్థులు ఇంటర్‌నెట్, మీసేవా కేంద్రాలు, లేదా స్వయంగా కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాలు పెంపొందించే విధంగా నూతన కోర్సులు ప్రవేశపెట్టారు. ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు సమానంగా డిగ్రీలో కంప్యూటర్ కాంబినేషన్స్‌తో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు డిగ్రీతో ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

**నర్సంపేట డిగ్రీ కళాశాలలో హెల్ప్‌సెంటర్**

నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో జిల్లా స్థాయి దోస్త్ సహాయ కేంద్రం ప్రారంభించారు. దోస్త్ నమోదు ప్రక్రియలో విద్యార్థులకు ఏమైనా సాంకేతిక ఇబ్బందులు కలిగితే కళాశాల సహాయ కేంద్రంలో పరిష్కారం పొందవచ్చు. కళాశాలలోని సహాయ కేంద్రంలో విద్యార్థులకు దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉచితంగా చేయబడుతుంది.



హెల్ప్ లైన్ సెంటర్ ప్రారంభిస్తున్న అధ్యాపకులు

**మూడు దశల్లో సీట్ల కేటాయింపు**

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం తొలి దశ రిజిస్ట్రేషన్ రూ.200 ఫీజుతో మే 6వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అవకాశం ఉంది. మే 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలి. జూన్ 3వ తేదీన దోస్త్ మొదటి దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. సీటు పొందిన వారు జూన్ 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సీటు పొందిన కాలేజీలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.

రెండో దశ రిజిస్ట్రేషన్ జూన్ 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తారు. దీనికి రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజుగా నిర్ణయించారు. జూన్ 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంటుంది. జూన్ 18వ తేదీన రెండో దశ సీట్లు కేటాయింపు ఉంటుంది. జూన్ 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టు చేయాలి.

మూడో దశ రిజిస్ట్రేషన్‌కు కూడా రూ.400 ఫీజు నిర్ధారించారు. జూన్ 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అవకాశం ఉంది. జూన్ 19వ తేదీ నుంచి 26వ వరకు వెబ్ ఆప్షన్, జూన్ 29న మూడో విడత సీట్లు కేటాయింపు జరుగుతుంది. జూన్ 29వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టు చేయాలి. జూలై 1వ తేదీ నుంచి అన్ని కళాశాలల్లో ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. జూలై 8వ తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి.



**కావాల్సిన ధ్రువపత్రాలు..**

- దోస్త్ రిజిస్ట్రేషన్ కోసం పదో తరగతి మెమో
- ఇంటర్ రెండో సంవత్సరం హాల్ టికెట్ నంబర్
- కులం, ఆదాయం ధృవపత్రాలు (01-04-2024తర్వాత జారీచేసినవి)
- మూడో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్,
- ఆధార్ కార్డు నంబర్, పాస్ ఫొటోలు,
- విద్యార్థుల ఆధార్ కార్డు నంబర్ మొబైల్ నంబర్‌కు అనుసంధానమై ఉండాలి.
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా చేయబడుతుంది.

**విశేషస్పందన వస్తోంది**



దోస్త్ కార్యక్రమానికి విశేషస్పందన వస్తోంది. అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. డిగ్రీ కోర్సులకు ఇంజనీరింగ్ కోర్సులతో సమాన ఆదరణ ఉంది.

– డాక్టర్ మల్లం నవీన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నర్సంపేట

## గాలివానతో నేలవాలిన వరిపంట



ఖానాపురంలో..

ఖానాపురం : మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన గాలివానతో వరిపంట నేలవాలింది. పాకాల ఆయకట్టు కింద అధికంగా వరి పంటలు సాగయ్యాయి. వర్షం పడటంతో వరిపంట దెబ్బతింది. కోసిన వరి మొదలు తడిసిపోయాయి. ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**గాలి.. వాన బీభత్సం**

నల్లబెల్లి: మండలంలోని నల్లబెల్లి, రుద్రగూడెం, గోవిందాపూర్, మేడపల్లి, రాంపూర్, కొండాపూర్, మూడుచెక్కలపల్లి, కన్నారాపేట, రంగాపురం తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి గాలి.. వాన బీభత్సాన్ని సృష్టించడంతో వరిపంట నేలవాలింది. మామిడికాయలు రాలిపోయాయి. అతివేగంతో వీచి న గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టమయ్యాయి. కోతకు వచ్చిన వరి గొలుసులు రాలిపోయాయి. ఆరబోసిన మొక్కజొన్నలు, వరి ధాన్యం తడిసిపోయింది. నేల వాలిన పంటలను చూసిన రైతులు కన్నీరు పెట్టుకున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలుముకుంది.

## రాజ్యాంగాన్ని కాపాడే పార్టీలకే మద్దతు



సమావేశంలో పాల్గొన్న విద్యార్థి సంఘాల బాధ్యులు

నర్సంపేట: భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు తెలుపుతున్నట్లు ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కల్యాణి, మమత, సుస్మిత తెలిపారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం ఐక్య విద్యార్థి మహిళా విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్ ఎత్తివేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రమ్య, సుజాత, కల్పన, రాధిక, భాగ్యశ్రీ, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

## నియామకం

పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన బొట్ల భాస్కర్‌ను బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్, తురుకల సోమారం గ్రామానికి చెందిన బూర శ్యామ్ మండల యూత్ కన్వీనర్‌గా నియమించినట్లు మండల అడ్‌హక్ కమిటీ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారిని అధిష్టానం సూచనల మేరకు నియమించినట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చడంలేదు



గురిజాలలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దాటవేస్తుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం కొమురయ్య, రాజమల్లు, చిన్నపెల్లి నర్సింగం, అల్లి రవి అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలో మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు ద్వారా సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



నర్సంపేట: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



చెన్నారావుపేట: పాత మగ్దుంపురంలో..



వర్ధన్నపేటలో..

నర్సంపేట: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆపార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని 22, 15, 13, 9, 10, 11, 24, 14, 23వ వార్డులలో బుధవారం ఆయా వార్డుల కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాత మగ్దుంపురంలో..**

చెన్నారావుపేట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు బుధవారం మండలంలోని పాత మగ్దుంపురం, ఎల్లాయగూడెం, అక్కల్‌చెడ, జల్లీ, పాపయ్యపేట గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, రమేష్, బొంత శ్రీను, కర్ణాకర్, పోలెపల్లి భిక్షపతి, శంకేసి రంజిత్, మంచిక చిరంజీవి, తదితరులు ఉన్నారు.

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు అన్నారు.ఈ మేరకు మండలంలోని కొత్తూరు గ్రామంలో బుధవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం కొత్తూరు తండా నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ముస్తఫ, జాటోతు నర్సింహ, రాజునాయక్, బాలునాయక్, ఈర్య, శ్రీను, రాజేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో భారీగా చేరికలు**

దుగ్గొండి: మండలంలోని బంధంపల్లి, పొనకల్, రేబల్లె గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సీపీఎం సీనియర్ నాయకుడు వేములపల్లి ఓదేలు, బంధంపల్లి గ్రామానికి చెందిన బత్తిని కొంరయ్య, బాసాని రాజిరెడ్డి, జోజిరెడ్డి, పొనకల్ గ్రామానికి చెందిన గుండెకారి రాజేశ్వర్‌రావు, మైనాల నగేష్‌ల ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, కిరణ్‌రెడ్డి, నర్సింగరావు, మట్ట రాజు, గాదం రమేష్, రవివర్మ, మైనర్‌బాబు పాల్గొన్నారు.

**కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలి**

పర్వతగిరి: వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ కోరారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నేడు(గురువారం) సాయంత్రం కార్నర్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పాల్గొంటారని తెలిపారు.

వర్ధన్నపేట: ఈ నెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం వర్ధన్నపేటలో పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పదేళ్ల పాలనతో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులను పెంచి పోషించి వారి గుప్పెట్లోనే ఉండేలా చేశారని దుయ్యబట్టారు. దీంతో పేదవాడు పేదవాడిగానే ఉన్నాడని పేర్కొన్నారు. బడా పారిశ్రామిక వేత్తలు కోట్లకు పడగలెత్తారని అన్నారు. దీంతో దేశాభివృద్ధి వెనక్కి వెళ్లి పోయిందన్నారు. కాంగ్రెస్ పాలనతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని, ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లమనేని కమలాకర్‌రావు, సిలువేరు శ్రీధర్, ఎండీ షబ్బీర్ అహ్మద్, ఆరెల్లి ప్రభాకర్, మంజూర్ అహ్మద్, పులి శ్రీనివాస్, వెంకటనర్సు, పాక సుజాత, విలాసారపు వెంకట్, కోల అనిల్‌కుమార్, గాదె వెంకటయ్య, కుదరుపాక ప్రసాద్, బేతి మధుకర్ పాల్గొన్నారు.

## హామీలతో మభ్యపెడుతున్న పాలకులు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట: ఎన్నికల్లో లబ్దిపొందేందుకు అమలు చేయని హామీలను గుప్పించి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ప్రజలపై సవారీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పాలకవర్గాల అభ్యర్థులను ఓడించి బీఎల్ఎఫ్ ఎంసీపీఐ(యూ) బలపర్చిన అభ్యర్థులను ఆదరించి ఓటేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శిపెద్దారపు రమేశ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం కలకోట్ల యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను విస్మరించి కొత్త హామీలతో ప్రజలను ఇబ్బందుల పాలు చేసేందుకు ప్రయత్నస్తుందన్నారు. బీజేపీ పాలనకు చరమగీతం పాడకపోతే భారత ప్రజలు నియంతృత్వ మతోన్మాదం పాసిస్టు పాలనలో తీవ్రంగా అణిచివేయబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ అంటూ పాత పద్దతుల్లోనే పెట్టుబడిదారి పాలనకు బాటలు వేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో వామపక్ష పార్టీలు సామాజిక శక్తులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి ఎంసీపీఐ(యూ)మద్దతు పోటీ చేస్తున్న ఆదివాసి ప్రజా సంఘాల నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య కత్తెర గుర్తుకు ఓటు వేసే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొంరయ్య, యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు జన్ను రమేష్, దామ సాంబయ్య, డివిజన్ కమిటీ సభ్యులు కుక్కల యాకయ్య, బండారి మల్లేశ్, మోటం సురేశ్, పెరబోయిన అయిలోని, రాఘవయ్య, స్వరూప, ప్రమీల, రాజేశ్, ఖాజా, దేవమ్మ, సుభద్ర, జ్యోతి పాల్గొన్నారు.

## గ్రామాల్లో రాజకీయ పార్టీల ప్రచారాలు



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

రాయపర్తి: మండలకేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో పలు రాజకీయపార్టీల నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో తొర్రూరు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, గ్రామపార్టీ అధ్యక్షుడు తీగల సాయిలు, బండి కుమార్, సుతారి యాదగిరి, పుల్లూరు దామోదర్, వెంకన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి, జాజునాయక్, చిన్నాల రాజబాబు, బండి రాజబాబు, మాకినేని కృష్ణారావు, సుధాకర్, పెద్ది వీరస్వామి, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ

నడికూడ : బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి గుణపాఠం చెప్పాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. 10 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంపై అధికారం చెలాయించిన బీజేపీతో పాటు రాష్ట్రంలో 90 శాతం జనాభా ఉన్న బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా అణిచివేసిన బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. డాక్టర్ చందా మల్లయ్య, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ సుధాకర్, చంద్రమౌళి, కుమారస్వామి, రాజయ్య పాల్గొన్నారు.

## ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో జరిగే 26వ రజతోత్సవాల ఆహ్వాన పత్రికలను బుధవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లుశర్మ భక్తులతో కలిసి ఆవిష్కరించారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేశారు. రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ స్వామివారి పుట్టిన రోజును పురస్కరించుకుని కనులపండువగా సాగే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారికి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

## ఉద్యోగి ఉన్నతిలో నిజాయితీ ప్రధాన భూమిక

కేయూ క్యాంపస్: ఉద్యోగి ఉన్నతిలో నిజాయితీ, సమయపాలన ప్రధాన భూమిక వహిస్తాయని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. యూనివర్సిటీలో గత కొన్ని నెలలుగా పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినవారికి బుధవారం సెనెట్‌హాల్‌లో నిర్వహించిన సన్మానసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు తన పదవి కాలంలో చేసిన మంచి పనులు గీటురాయిగా ఉంటాయన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం మంచి జీవన విధానం, ఆర్థిక క్రమశిక్షణ, సానుకూల వాతావరణం ఏర్పాటుచేసుకోవటం తద్వారా తదుపరి జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో కేయూ మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, విజయబాబు, సుమతి ఉమామహేశ్వరి, రాజిరెడ్డి, అయిలయ్యలను సన్మానించారు.

## 'సఖి' సేవలపై అవగాహన



పోస్టర్లతో అవగాహన కలిగిస్తున్న ప్రతినిధులు

గీసుకొండ: మండలంలోని దస్రు తండా పరిధిలోని మంగళితండాలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ వారు లింగ ఆధారిత హింస, మహిళా రక్షణ చట్టాలపై సఖి సెంటర్‌లో అందిస్తున్న సేవలపై బుధవారం అవగాహన కలిగించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కౌన్సిలర్ ఇంద్ర, సఖి లీగల్ కౌన్సిలర్ శోభారాణి, సీసీ అక్తర్, కేస్‌వర్కర్ సుధ, వీఏఓ అమృత, ఓబీ సరిత, అంగన్‌వాడీ టీచర్ నీలావతి, సంఘం మహిళలు పాల్గొన్నారు.

## విభజన హామీలపై నోరు మెదపని మోదీ

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : వరంగల్‌లో జరిగిన బీజేపీ ఎన్నికల సభలో ప్రధాని మోదీ విభజన హామీల అమలుపై నోరు విప్పకుండా మరోసారి ప్రజలను మోసం చేసి మభ్యపెట్టే ప్రయత్నం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జిల్లా ముఖ్యకార్యకర్తలు ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో అధికారంలో ఉన్న బీజేపీ వరంగల్‌కు ఏం ఒరగబెట్టారని ఓటెయ్యాలని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయని ఆరోపించారు. కుల, మతాల పేరుతో ఓట్లు దండుకుని అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వంలో కేవలం కార్పొరేట్ వ్యవస్థలు మాత్రమే బాగుపడ్డాయని అన్నారు. పేదలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జ్యోతి, కరుణాకర్, శ్రీనివాస్, ఎల్లేశ్, లక్ష్మణ్, బిక్షపతి, సారంపాణి,ఏ.శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.